సాక్షి కర్నూలు

గురువారం ၊ 26 ၊ డిసెంబర్ ၊ 2024



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద పథకానికి బుధవారం కర్నూలుకు చెందిన రాజేంద్రప్రసాద్ రూ.లక్ష, అనంతపురం జిల్లాకు చెందిన సుబ్బారావు రూ. లక్ష చొప్పున విరాళమిచ్చారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం కర్నూలుకు చెందిన నాట్య వేద కళా నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,627.62
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:85.012
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:429
అవుట్ ఫ్లో	:7,432

న్యూస్‌రీల్

పదోన్నతులకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: మున్సిపల్ స్కూళ్లలో ఎస్‌జీటీలుగా పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అర్హుల సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, జాబితాలో ఉన్న వారు తమ సేవ పుస్తకం, అర్హత ధ్రువీకరణ పత్రాలు (రెండు సెట్లను)తీసుకొని డీఈఓ ఆఫీస్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

నేడు 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 20 గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని డివిజన్‌లో గోనెగొండ్ల మండలం పెద్దమర్రివీడు, నందవరం మండలం జోహరాపురం, ఎమ్మిగనూరు మండలం కందనాతి, కోసిగి మండలం సజ్జలగూడెం, ఎండపల్లి, కౌతాళం మండలం పోడలకుంట మదిర, మంత్రాలయం మండలం బసాపురం, ఆదోనిమండలం కపటి, హోళగుంద మండలం హోళగుంద గ్రామాల్లో సదస్సులు జరుగునున్నట్లు తెలిపారు. అలాగే కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఓర్వకల్ మండలం తిప్పాయపల్లి, కల్లూరు మండలం బస్తిపాడు, వెల్దుర్తి మండలం నర్లాపురం, కర్నూలు రూరల్ ఎదురూరు, పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో మండల కేంద్రం తుగ్గలి, ఆలూరు కమ్మరచేడు, చిప్పగిరి ఖజాపురం, ఆస్పరి తురువగల్, హాలహర్వి గూళ్యం, జె.కోసల్లిలలో జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

మోహిని అలంకరణలో గోదాదేవి



గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవమూర్తి గోదాదేవి మోహిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస పూజల్లో భాగంగా ముందుగా ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వామితోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదపండితుల కనుల పండువగా నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తి గోదాదేవిని మోహినిగా అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు.

సా..గుతున్న కంప్యూటరీకరణ!

- కేడీసీసీ బ్యాంక్‌లో పూర్తిగా నిలిచిన రుణాల పంపిణీ


కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణ సాగుతూనే ఉంది. దీని వల్ల రుణాల పంపిణీ ప్రక్రియ పూర్తిగా బంద్ అయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఫిబ్రవరి నెలలో జాతీయ స్థాయిలో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రతి పీఏసీఎస్‌కు రూ.4 లక్షలు కేటాయించింది. కర్నూలు జిల్లాలో 43 పీఏసీఎస్‌లు ఉండగా... ప్రీ మైగ్రేషన్‌కు వచ్చింది కేవలం 26 సంఘాలు మాత్రమే. ఇందులో కూడా 23 సంఘాల్లోనే ప్రీ మైగ్రేషన్ పూర్తి అయింది. అంటే 50 శాతం సంఘాల్లోనే ఈ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన సంఘాల ప్రీ మైగ్రేషన్ ఎప్పటికి పూర్తవుతుందనేది జవాబు లేని ప్రశ్న. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు జరుగుతున్న లావాదేవీలను కూడా కంప్యూటరీకరణ చేయాల్సి ఉంది. అక్టోబరు 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం. అయితే, డిసెంబరు నెల ముగింపునకు వస్తున్నా పూర్తి కాలేదు. అధికారులు కూడా ఈ ప్రక్రియ పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శ్రీశైలంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం రీజనల్ విజిలెన్స్ అధికారి చౌడేశ్వరి ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థాన ఇంజినీరింగ్ విభాగంలో తనిఖీలు చేశారు. గతంలో దేవస్థానంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు గణేష్ సదనం, నక్షత్రవనం, సరిహద్దు నిర్మాణ పనులపై విచారణ చేపట్టి, పలు రికార్డులను పరిశీలించారు.

యమడ్రింకరులు

కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన కొంత మంది యువకులు స్నేహితుని పుట్టిన రోజు వేడుకలను అలంపూరు గ్రామ శివారులోని ఓ తోటలో జరుపుకున్నారు. అనంతరం కర్నూలుకు వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు తుంగభద్ర బ్రిడ్జి దగ్గర ప్రమాదానికి గురైంది. ఏ వాహనమూ వారికి అడ్డు రాలేదు. వేగంగా వెళ్లి బ్రిడ్జికి ఢీకొట్టడం వల్ల ఘటనా స్థలంలోనే ఒకరు మృతిచెందగా మరో నలుగురు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం కూడా మద్యం మత్తులో వాహనం నడపటమే కారణమని పోలీసులు తేల్చారు. ఇలాంటి ఘటనలతో ఆయా కుటుంబాలు చీకటిలోకి జారుకుంటున్నాయి.



కొన్నాళ్ల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఎదురుగా మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటనలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు మృతి చెందాడు. వాహనం నడిపిన యువకుడు బార్‌లో పని చేస్తాడు. రాత్రి ఫుల్‌గా మద్యం తాగి వాహనాన్ని వేగంగా నడపటంతో ప్రమాదం జరిగింది.

ఇటీవల కల్లూరు వక్కెర వాగు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యు వాత పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడు వేగంగా వాహనం నడపటం ప్రమాదానికి కారణమైంది. యువకుడు మృతి చెందిన వారం రోజులకే భార్య మగ బిడ్డకు జన్మనిచ్చింది. భవిష్యత్తు బంగారుమయంగా గడపాల్సిన కుటుంబం విషాదంలో మునిగింది.

- పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- మద్యం మత్తులో రోడ్డెక్కడంతో ప్రమాదాలు
- చనిపోతూ, మరి కొందరి మృతికి కారణమవుతున్న వైనం
- మూడేళ్లలో 2,596 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- జైలు శిక్షలు పడుతున్నా యువతలో కనిపించని మార్పు

జిల్లాలో గత మూడేళ్లగా నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానా (రూ.లక్షలు)	జైలుశిక్ష (మంది)
2022	316	14.94	246
2023	1156	14.28	983
2024 నవంబర్ వరకు	1124	3.21	893

కర్నూలు: వారు నడిస్తే.. కాళ్లు రకరకాలుగా అడుగులేస్తాయి. ఇక వాహనాలు నడిపితే యముడు వెనుక వస్తున్నట్లే. మృత్యువుకు ఎదురెళ్తారు. ఎందుకంటే వారి శరీరంలోకి మద్యం వెళ్లింది. ఏమి జరుగుతుందో తెలుసుకునేలోపే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మత్తులో రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. అలా వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతోనూ ఆడుకుంటున్నారు. మద్యం మత్తులోని యమకింకరులను పోలీసులు పట్టుకుంటున్నా, కోర్టు శిక్షలు విధిస్తున్నా నానాటికీ పెరిగిపోతున్న కేసులు మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం ఎక్కడో చోట మద్యం మత్తులో ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవిస్తున్నాయి. మద్యం తాగడం ఎంత హానికరమో.. వివరించే ప్రచార చిత్రాలు చాలా చోట్ల కనిపిస్తుంటాయి. పోలీసులు కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తుంటారు. ఇవి చాలా మందిలో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. పండుగలు, ఉత్సవాలు, ఇళ్లలో జరిగే శుభకార్యాల పేరుతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. అదే సమయంలో వాహనాలతో రోడ్లపైకి రావడం ముప్పు తెస్తోంది. ఎక్కువగా 20 నుంచి 45 సంవత్సరాల మధ్య యువకులే తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. 40 నుంచి 55 ఏళ్ల వయస్సు వారు తర్వాత స్థానంలో ఉన్నారు. ఇటీవల కాలంలో 18 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు వారు కూడా అధికంగానే మద్యం సేవించి తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.



కర్నూలు నగరంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

చైతన్యపరుస్తున్నా.. లెక్క చేయని యువత

మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని పోలీసులు జిల్లాలో నిత్యం ఎక్కడో చోట అవగాహన కల్పిస్తున్నప్పటికీ యువత లెక్క చేయడం లేదు. ఎంతో భవిష్యత్తు ఊహించుకున్న కన్నవారు తేరుకోలేని పరిస్థితిలోకి వెళ్లిపోతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంత ప్రమాదమో ఎక్కడికక్కడ చైతన్యం చేస్తున్నప్పటికీ కొందరు లెక్క చేయడం లేదు. చివరకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. వారిపై ఆధారపడినవారిని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. జిల్లాలో ఏటా డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు కూడా ఎక్కడికక్కడ పకడ్బందీగా తనిఖీలు ముమ్మరం చేశారు. వారిని కూడా తప్పించుకుని వెళ్లిపోయినవారిని లెక్కల్లోకి తీసుకుంటే భయపడేంత స్థాయిలో మద్యం ప్రియులు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. దొరికిన కొందరు కొన్ని రోజుల పాటు జైలు శిక్షకు కూడా గురవుతున్నారు.

ఇన్ని ఘటనలు తమ చుట్టూ జరుగుతున్నా 'నిషా'లో మునిగిన వారు వాహనాలు నడపటం మాత్రం ఆపడం లేదు. మూడేళ్లలో 2,596 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలు....

సంవత్సరం	ద్విచక్ర వాహనాలు	ఆటోలు	కార్లు	ఇతర వాహనాలు
2022	214	62	9	31
2023	956	121	23	56
2024 నవంబర్ వరకు	1046	57	0	21

మద్యం తాగి చిక్కిన వాహనదారులు (వయస్సుల వారీగా)....

సంవత్సరం	19-20 ఏళ్ల వయస్సు	26-40 ఏళ్ల వయస్సు	40 ఏళ్ల పైబడినవారు
2022	256	84	76
2023	756	293	107
2024	841	219	64

జైలు.. జరిమానా



మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరం అని అందరికీ తెలిసిన విషయమే. ఇలా చేస్తే భారీ జరిమానాలు, జైలు శిక్ష వేస్తారని కూడా మందు బాబులు తెలుసుకోవాలి. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడవితే మొదటిసారి రూ.10,000 వరకు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండో సారి కూడా ఇదే తప్పు చేస్తే రూ.15,000 వరకు జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. ఇలాంటి సంఘటనల్లో ఎవరికైనా ప్రాణాపాయం కలిగితే జైలు శిక్ష కూడా రెండేళ్లు ఉండేది. కొత్త చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే మరణాలకు ఐదు సంవత్సరాల వరకు తప్పనిసరి జైలు శిక్ష విధిస్తారు. అంతేకాకుండా జరిమానా కూడా ఎక్కువగా వేస్తారు. ఒకవేళ ప్రమాదం చేసిన వ్యక్తి చనిపోయిన వ్యక్తి మరణానికి సరైన కారణం చెప్పకపోతే 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో సహా అదనపు కఠినమైన శిక్షలు విధించే విధంగా చట్టాన్ని మార్చారు.

కుటుంబాలకు తలవంపులు....

దొంగలు కాదు... రౌడీలు అంతకన్నా కాదు... పెద్ద నేరాలు చేయలేదు... కానీ మత్తులో వాహనాలు తోలడం వల్ల జైలు జీవితం గడపాల్సి వస్తోంది. దీనికి కారణం... మద్యం తాగి వాహనం నడపటమే. మత్తులో వారితో పాటు ఎదుటివారి జీవితాలు కూడా నాశనమవుతాయనే ఉద్దేశంతో పోలీసులు మద్యం బాబులపై కొరఢా ఝుళిపిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారు ప్రవర్తన మార్చుకోవాలని సూచిస్తూ పరివర్తన కోసం న్యాయమూర్తులు కూడా కఠినమైన తీర్పులు ఇస్తున్నారు. చాలామంది యువకులు మద్యం తాగి పట్టుబడుతున్నా వారిలో మార్పు కనిపించడం లేదు. ఇలాంటి వారిలో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా ఉంటున్నారు. వాస్తవానికి మనిషిలో నేర ప్రవృత్తి తొలగి జీవితాల్లో పరివర్తన రావాలనే జైలు శిక్ష విధిస్తారు. కానీ ఎంతైనా జైలు శిక్ష పడితే సమాజంలో చెడ్డ పేరు వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ రెండు మూడు రోజులు జైలుకు వెళ్లారంటే వారి కుటుంబాలకు తలవంపే. ఇలా వరుసగా మూడుసార్లు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేసే అవకాశాలు ఉన్నట్లు పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం



మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించవద్దు. ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపటం, ప్రమాదాలకు గురవటం ఆందోళనకరం. చాలా మందిలో మార్పు రావడం లేదు. వారి విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కౌన్సెలింగ్‌లో సూచిస్తున్నాం.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ, కర్నూలు

బీపీ, షుగర్‌లే ఎక్కువ

- బీపీ 20 శాతం, షుగర్ 18 శాతం మందికి
- తర్వాత స్థానంలో నోటి క్యాన్సర్
- ఎన్‌సీడీ సర్వేలో వెల్లడి
- జిల్లాలో ఇప్పటికి 20 శాతం సర్వే పూర్తి
- జిల్లాలో 672 బృందాలతో సర్వే
- రోజూ ఒక్కో బృందం ఐదు కుటుంబాల సర్వే
- సర్వేకు ఏడాది సమయం



ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రజలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): చిన్నా పెద్దా తేడా లేదు. పట్టణ, గ్రామీణ అన్న తారతమ్యం అసలే లేదు. మారిన జీవనశైలి కారణంగా సమాజంలో ఎక్కడ చూసినా దీర్ఘకాలిక వ్యాధిపీడితులే కనిపిస్తున్నారు. అందులో ఎక్కువ మందిని బాధపెట్టే బీపీ, షుగర్ వ్యాధిలే ఉన్నాయి. ఒకప్పుడు వందలో ఏ ఒక్కరో ఇద్దరో ఇలాంటి రోగులుండేవారు. ఇప్పుడు పది మందిలో ఒకరిద్దరు ఉంటున్నారు. వీరు వచ్చిన రోగాలను తగ్గించుకునేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వే 3.0 ద్వారా వెల్లడవుతోంది. జిల్లాలో గత నెల 14వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. ఏడాది వరకు ఈ స్క్రీనింగ్ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ స్క్రీనింగ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశ, పట్టణ ప్రాంతంలో ఏఎన్ఎం, ఆశాలు కలిపి ఒక బృందంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 909 మంది ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి శిక్షణ ఇప్పించారు. వీరిలో 127 మంది మెడికల్ ఆఫీసర్లు, 28 మంది నర్సులు, 428 మంది సీహెచ్‌వోలు, 326 మంది ఏఎన్ఎంలు శిక్షణ పొందారు. ఎన్‌సీడీ సర్వే 3.0లో భాగంగా ప్రతి బృందం రోజుకు ఐదు కుటుంబాలను పరిశీలిస్తోంది. 18 ఏళ్లపైబడిన వారందరికీ ఈ స్క్రీనింగ్‌లో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మౌఖికంగా రొమ్ము, సర్వికల్ క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్ స్క్రీనింగ్ చేస్తున్నారు. ఈ సర్వే ద్వారా ఆరోగ్య విద్య, పరిశుభ్రత ప్రాముఖ్యతను ఆరోగ్య బృందం ఇంటి వద్దనే అందిస్తోంది. అనుమానిత కేసులను పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వద్దకు పంపిస్తున్నారు. అక్కడ కూడా నివృత్తి కాని కేసులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, క్యాన్సర్ ఆసుపత్రికి పంపిస్తున్నారు.

పట్టణాల్లో అధికంగా బాధితులు

బీపీ, షుగర్ బాధితులు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పట్టణాల్లో వ్యాధిపీడితులు పెరగడానికి కారణం కూడా పూర్తిగా ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండిన ఆహారాన్ని తినడం, వంశపారంపర్యం, శారీరక వ్యాయామం తగ్గిపోవడం, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం, రాత్రిళ్లు ఎక్కువ సేపు మేల్కొని ఉండటం, మానసిక ఒత్తిళ్లు కారణంగా నాన్ కమ్యూనిటీ డిసీజ్(అంటు వ్యాధి కాని వ్యాధులైన బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్) వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట నుంచి గంట పాటు వ్యాయామం చేయాలని, ధూమ, మద్యపానం మానేయాలని, తెల్ల అన్నానికి బదులు కార్బొహైడ్రేట్స్ తక్కువగా ఉండే మిల్లెట్స్ తినాలని, మానసిక ఒత్తిళ్లు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

ఎక్కువగా బీపీ, షుగర్ బాధితులే...

జిల్లాలో 18 ఏళ్లకు పైబడిన వారు 18,72,547 మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. నవంబర్ 14 నుంచి చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకు 1,88,351 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13,132 మందికి బీపీ, 8,208 మందికి షుగర్, 12 మందికి నోటి క్యాన్సర్, 33 మందికి రొమ్ము క్యాన్సర్, 16 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉన్న ట్లు నిర్ధారించారు. మరో 97,294 మందికి పైవ్యాధులున్నట్లు అనుమానితులుగా పేర్కొంటూ వైద్యాధికారుల వద్దకు రెఫర్ చేశారు. ఇందులో 18,018 మందికి బీపీ, 14,686 మందికి షుగర్, 598 మందికి నోటి క్యాన్సర్, 413 మందికి రొమ్ము క్యాన్సర్, 667 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ముమ్మరంగా ఎన్‌సీడీ 3.0 సర్వే



ఎన్‌సీడీ 3.0 సర్వే ముమ్మరంగా సాగుతోంది. మొదట్లో కొద్దిగా నెమ్మదించినా ప్రస్తుతం సర్వే ఊపందుకుంది. ఒక్కో బృందం రోజుకు ఐదు ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులు ఉన్నాయా లేదా అని పరీక్షిస్తున్నారు. ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

–హేమలత, ఎన్‌సీడీ అధికారిణి, కర్నూలు



కర్నూలులోని హోసన్న మందిరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కరుణామయుడు.. వెలుగై వచ్చెను!



లోకానికంతటికీ వెలుగులు పంచిన బాల యేసు జన్మదినం ఆధ్యాత్మిక కిరణాలు ప్రసరింపజేసింది. ప్రభునామాన్ని స్మరించుకుటూ క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి లోకరక్షకుడికి స్వాగతం పలికారు. క్రీస్తు నేడు పుట్టును.. అని జయజయధ్వానాలు చేస్తూ వాడవాడలా పండుగ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్రిస్మస్ వేడుకలు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకను స్వాగతిస్తూ అర్ధరాత్రి నుంచే సంబరాలు చేశారు. క్రైస్తవులు భారీగా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనా మందిరాల్లో దైవ సందేశకులు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. లోకాన్ని రక్షించేందుకే క్రీస్తు జన్మించారని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. జీసస్ మాట ప్రపంచ శాంతికి బాట అని నవ సమాజ నిర్మాణమే క్రిస్మస్ ధ్యేయమన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ వంటి క్రీస్తు సందేశాలు మనలను సన్మార్గంలో నడిపిస్తాయని చెబుతూ అందరిపై క్రీస్తు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు.



కర్నూలు సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక పార్థనలో పాస్టర్లు

– కర్నూలు కల్చరల్

తెరుచుకున్న రేషన్‌షాపులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో కూటమి నాయకులు దౌర్జన్యంగా మూత వేసిన రేషన్‌షాపులు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పార్థసారధి ఇటీవల జరిగిన సమావేశంలో రేషన్ డీలర్లు స్వతహాగా తప్పుకొని తమ కార్యకర్తలకు దుకాణాలు అప్పగించాలని లేకపోతే దౌర్జన్యంగా వాటిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. దీంతో కూటమి నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి పట్టణంలో 9 దుకాణాలకు తాళాలు వేశారు. దీనిపై బాధిత డీలర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేసి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఆదేశాలు జారీ చేయడంతో వారు దుకాణాల తాళాలను పగలగొట్టి సంబంధిత డీలర్లకు వాటిని అప్పగించారు.



రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో రేషన్ దుకాణాన్ని తెరిచిన దృశ్యం

బీసీ సంక్షేమ, సాధికారత అధికారిగా వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్): జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిగా శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కే వెంకటేశ్వర్లుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఈఓగా విధులు నిర్వహిస్తున్న పీ వెంకటలక్షుమ్మ గత నెలలో నెల్లూరుకు బదిలీ అయ్యారు. అయితే ఆమె బీసీ సంక్షేమ శాఖతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీగా కూ డా అదనపు బాధ్యతలు నిర్వహిస్తు వచ్చారు. ఇటీవలే ఐసీడీఎస్‌కు రెగ్యులర్ అధికారి రావడం వల్ల వెంకటలక్షుమ్మ బుధవారం జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా అనుమతితో రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే డీబీసీడబ్ల్యూఈఓగా వెంకటేశ్వర్లు గురువారం అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

హైందవ శంఖారావం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: విజయవాడలో జనవరి 5వ తేదీ నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం దేవీ ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఎంట్రీ పాస్, కారు ఎంట్రీ పాస్, ప్రయాణికుల గుర్తింపు కార్డులను వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, సహ కార్యదర్శి ప్రాణేష్, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ భాను ప్రకాష్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ హైందవ శంఖారావం బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని కోరారు. గుర్తింపు కార్డు, ఎంట్రీ పాస్ ఉంటేనే సభకు అనుమతి ఇస్తారన్నారు. కార్యకర్తలు క్రమశిక్షణతో ఉండి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో హైందవ శంఖారావం సహ కన్వీనర్లు చంద్రశేఖర్, హనుమంత రెడ్డి, రవాణా ప్రముఖ్ ఈపూరి నాగరాజు, సభ్యులు రాంబాబు, శ్రీనివాస రాజులు, శివరాముడు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు అరవింద్

ఆదోని అర్బన్: మండల పరిధిలోని గణేకల్ గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని గణేకల్ గ్రామానికి చెందిన రామాంజిని, నాగవేణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో సమీపలోని ఆలయానికి దర్శనం నిమిత్తం బయలుదేరారు. మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడటంతో అరవింద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న ఇస్వీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అధికారులు నమ్మించి మోసం చేశారు

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు

ఆదోని రూరల్: పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి మాదిగలను నమ్మించి మోసం చేశారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు ఆరోపించారు. మండలంలోని జి.హొసళ్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఊరు దేవరలో బోనాలు మాదిగలు ముందుగా తీసుకెళ్లరాదంటూ ఏళ్లుగా వివక్ష ఉండేదని, ఇదే విషయమై కొన్ని రోజులుగా దళితులకు, దళితేతరులకు వివాదం నడుస్తోందని చెప్పారు. అందరితో సమానంగా మాదిగల బోనాలను పంపాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు అనర్థం జరుగుతుందని భయపెట్టి మరోసారి వివక్షను కొనసాగించారని ఆరోపించారు. వివక్ష నిర్మూలనకు ప్రతిఘటన తప్పదని, కలిసి వచ్చే వారందరితో వివక్షకు వ్యతిరేకంగా చలో హొసళ్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.జి.కృష్ణ, మండలాధ్యక్షులు మునిస్వామి, మండల కార్యదర్శి బి.తిక్కప్ప, కేవీపీఎస్ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, రమేష్, నాయకులు మల్లికార్జున, చిన్నరాఘవేంద్ర, రాము, పెద్ద రాఘవేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.



రుద్రవరంలో శిలువతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో హోసన్న మందిరంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న క్రైస్తవులు



కర్నూలు సీక్యాంప్ ప్రార్థనామందిరంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్!



సి.బెళగల్ ఏబీఎం చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

జిల్లా వ్యాప్తంగా క్రిస్టియన్లు బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. క్రీస్తు పుట్టుకను స్వాగతిస్తూ సంబరాలు చేశారు. భారీగా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కరుణామయుని జన్మవృత్తాంతం, క్రిస్మస్ తాత వేషధారణలతో చిన్నారులు అలరించారు. గీతాలాపనలతో యువతులు భక్తిని చాటుకున్నారు. ఊరేగింపులు అలరించాయి. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు.



మద్దికెర: బాలయేసును పూలతో అలంకరించిన దృశ్యం



కర్నూలులో ఏసుక్రీస్తు జన్మవృత్తాంతం గీతాలను ఆలపిస్తున్న మహిళలు



ఆలూరు: ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



పాములపాడు: పశువులపాక వద్ద ఏసుక్రీస్తు జన్మ వృత్తాంత నాటక పాత్రధారులు



సీఎస్ఐ చర్చిలో ఫాదర్ల నుంచి దీవెనలు అందుకుంటున్న దృశ్యం



కోల్స్ చర్చిలో క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

పైరును నల్లిపేసింది.!

- తెగుళ్లతో మిరప రైతు కుదేలు
- పెట్టుబడులకు దిగుబడులు లేక విలవిల
- పీల్చి పిప్పిచేసిన నల్లి, జెమిని వైరస్



నల్లి సోకిన మిరప పైరు

మంత్రాలయం: మిరప రైతును నల్లి నట్టేట ముంచేసింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా నల్లి(తామర కీటకం) మాత్రం చావకపోగా పైరును పీల్చి పిప్పిజేసేసి రైతన్నలను కన్నీళ్లు పెట్టించింది. మిరప సాగులో మొదటి స్థానం గుంటూరు కాగా కర్నూలు జిల్లా రెండో స్థానం. కర్నూలు జిల్లాలో మరీ ఎక్కువగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో డీలక్స్ రకాలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 95,477 వేల ఎకరాల్లో మిరప సాగైంది.

నల్లి తామర ఎఫెక్టు..

పెద్దకడబూరు, మంత్రాలయం, నందవరం, చిప్పగిరి, ఆదోని, కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లో మిరప ఎక్కువగా సాగైంది. జిల్లా పశ్చిమ ప్రాంతంలో దాదాపు 27 వేల ఎకరాల్లో పైర్లకు నల్లి తామర నష్టం కల్గించినట్లు అంచనా. నల్లి మూలంగా జెమిని వైరస్ సోకి పైర్లన్నీ నాశనమయ్యాయి. మంచు కురిసే సమయంలో నల్లి తామర వ్యాప్తి విపరీతంగా ఉంటుంది. మిరపకు ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి ముడతగా మార్చేస్తుంది. ముడతతోపాటు మొగ్గలపై ప్రభావం చూపడంతో పూత నేలరాలిపోతుంది. ఒకవేళ అరకొర పూత మిగిలినా కాయ సైజు మజ్జుగా మారిపోతుంది. దీంతో దిగుబడి తగ్గిపోతుంది. ఆరోగ్యకర పైరు ఉంటే ఎకరాకు 50 క్వింటాల్ వరకు దిగుబడి వస్తుంది. ఈ నల్లి తామర సోకితే ఎకరాకు 4–5 క్వింటాల్ మించి పంట రాదు. ఈసారి తామర ప్రభావం మరింతగా పెరిగింది.

సర్కారు చోద్యం

వైరస్ మూలంగా రైతులకు సరైనా దిగుబడులు లేకపోయాయి. కనీసం పండిన అరకొర పంటను అమ్ముకోవడానికి గిట్టుబాటు ధర లేదు. డీలక్స్ క్వింటాల్ రూ.10–12 వేలు మాత్రమే ధర పలుకుతోంది. తేజ రకాలు క్వింటాల్ రూ.12–14 వేలు పోతోంది. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెడితే ప్రస్తుతం రూ.30 వేలకు మించి చేతికందలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎరువుల ధర బస్తాపై రూ.100–200 పెంచడంతో పెట్టుబడి భారం మరింతగా పెరిగిపోయింది. రైతులను గట్టెక్కించే చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

ఎకరాకు రెండు క్వింటాళ్లు గగనమే



ఒక ఎకరాలో దేవనూర్ డీలక్స్ రకం మిరప వేశాను. పంట ఎదుగుతున్న తరుణంలో నల్లతామర సోకింది. తామర నుంచి పంటను కాపాడుకునేందుకు రూ.60 వేలకుపైగా ఖర్చు పెట్టుకున్నా. దుక్కి, కూలీలు, ఎరువులతో కలిపి ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు ఖర్చు చేశాను. నల్లి కారణంగా ఎకరాకు 1.50 క్వింటం వరకు రావొచ్చు. కోత కోసుకుని అమ్ముదామంటే కూలీలకు కూడా దిగుబడి సరిపోదు. ఈ ఏడాది పూర్తిగా నల్లి పంటను నాశనం చేసింది.

– యల్లారెడ్డి, జొహరాపురం

పైరంతా నాశనం



నల్లి కారణంగా పైరంతా దెబ్బతింది. పూత, కాయ పూర్తిగా రాలిపోతోంది. మూడు ఎకరాల్లో మిరప వేశాను. నల్లి మూలంగా సగానికి పైగా దిగుబడి తగ్గిపోయింది. ఎన్ని మందులు కొట్టినా కంట్రోలు కావడం లేదు. మార్కెట్లో ధరలు లేకపోవడంతో మిరపకాయలు కల్లంలోనే పెట్టుకున్నాం. ఎకరాకు రూ.1.22 వేలు ఖర్చు వచ్చింది. పంట చూస్తే ఎకరాకు 5 క్వింటాల్ పండే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లింగన్న, పెద్దకడబూరు

పంటను కాపాడుకోవాలి

వాతావరణంలో మార్పు కారణంగా ఈ మధ్య నల్లతామర ప్రభావం పెరిగిపోయింది. మంచు కురిసే సమయంలో తామర శాతం ఎక్కువగా ఉంటుంది. తామర నుంచి పంటల రక్షించుకోవడానికి పైరు చుట్టూరా బార్డర్ క్రాప్ వేసుకోవాలి. పైరులో అక్కడక్కడా బంతిపూలు వేసుకోవాలి. నీలం, ఆకు పచ్చ రంగుల అట్టలను పైరులో అతికించుకోవాలి.

– అపర్ణ, వ్యవసాయాధికారిణి, హార్టికల్చర్

చకచకా తవ్వేసి.. బిరబిరా నాటేద్దాం





పొలంలో గుంతలు తీస్తున్న ట్రోలి ఎర్త్ అగర్ యంత్రం,యంత్రం సాయంతో తవ్విన గుంత

కర్నూలు(రూరల్): వ్యవసాయంలో యాంత్రీకరణతో రైతులకు వ్యయప్రయాసలు తగ్గుతున్నాయి. ఈ క్రమంలో పొలాల్లో గుంతలు తవ్వేందుకు కొత్తగా ట్రోలి ఎర్త్‌అగర్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రానికి ఒక లీటర్ డీజిల్ పోస్తే గంట సమయంలో 50 గుంతలు తవ్వొచ్చు. తద్వారా రైతులకు కూలీల ఖర్చు, సమయం ఆదా అవుతుంది. ఉద్యాన మొక్కలు నాటుకునేందుకు, పొగాకు రైతులు గుంజలు పాతి బేళ్లను ఆరబెట్టేందుకు ఈ యంత్రం ఉపయోగకరంగా ఉంటుంది. మండలంలో 1,968 హెక్టార్లలో, అర్బన్ పరిధిలో 84 హెక్టార్లలో పొగాకు సాగయ్యింది. ప్రస్తుతం కోతల సీజన్ కావడంతో రైతులు పొగాకు ఆరబెట్టేందుకు గుంజలను పాతి పందిళ్ల ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం 4 అడుగుల లోతు గుంతలు తవ్వి గుంజలు పాతాలి. ఎకరం పొగాకును ఆరబెట్టేందుకు 50 గుంతలు తవ్వుకోవాలి. ఇందుకు నలుగురు కూలీలు అవసరమవుతారు. రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. ఈ స్థితిలో ట్రోలీ ఎర్త్‌అగర్ యంత్రం రైతులకు బాగా ఉపయోగపడుతోంది. తక్కువ బరువుతో సులభంగా వినియోగించే అవకాశం ఉండడంతో రైతులు ఈ యంత్రంతో గుంతలు తవ్వి గుంజలు పాతి పొగాకు బేళ్లను ఆరబెడుతున్నారు. అలాగే మామిడి, సపోట, జామ, ద్రాక్ష, బొప్పాయి, చీని, డ్రాగన్ ఫ్రూట్, టెంకాయ తదితర మొక్కలు నాటేందుకు పొలాల్లో గుంతలు తీసేందుకు యంత్రం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఐక్యతతోనే బలిజ జాతి అభివృద్ధి

- బలిజ, కాపు నేతల స్మృతి సభలో నేతలు



నివాళులర్పిస్తున్న రోపా నేతలు

కర్నూలు(అర్బన్): ఐక్యతతో ముందుకు సాగితేనే బలిజ జాతి అభివృద్ధి సాధ్యమవుతుందని బలిజ, కాపు సంఘం నేతలు అన్నారు. బుధవారం స్థానిక రోపా కార్యాలయంలో బలిజ, కాపు మహనీయుల స్మృతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం నేతలు వినుకోట నాగేశ్వరరావు, భాస్కర్ బాబు, రిటైర్డు ఎంపీఐ కోనేటి చంద్రబాబు, రిటైర్డ్ ఎస్పీ ఐ వెంకటేష్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రామ్‌నాథ్, డీఈఈలు మర్రి రమేష్‌బాబు, మలిశెట్టి దివాకర్‌రావు, కేడీసీసీ బ్యాంకు జీఎం రామాంజనేయులు, రిటైర్డ్ తహసీల్దార్ ఎంఆర్‌ఓ బీపీ శ్రీనివాసరావు హాజరయ్యారు. రోపా అధ్యక్ష, కార్యదర్శులు చింతలపల్లి రామక్రిష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా మిరియాల వెంకటరావు, వంగవీటి మోహనరంగా, కైకాల సత్యనారాయణ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరియాల వెంకటరావు, వంగవీటి మోహనరంగా, కైకాల సత్యనారాయణ కాపు, తెలగ, ఒంటరి, బలిజ, మున్నూరు కాపు జాతి ఔన్నత్యానికి ఎంతో కృషి చేశారన్నారు. వారి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో రోపా, బలిజ సంఘం ప్రతినిధులు పెద్దస్వామి, వడ్ల శ్రీకాంత్, రంగనాయకులు, బుర్రా చంద్రమోహన్, శ్రీనివాసరావు, గౌతమ్‌క్రిష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు



బెల్లంఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని కోళ్ల బావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో తయారు చేస్తున్న నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 1,000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. వరుసగా దాడులు చేస్తున్నా నాటుసారా తయారీదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందకుండా చేసేందుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ దాడులలో ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్‌ఐ జబ్రుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్, పోలీసులు సుధీర్‌కుమార్, రామచంద్రుడు, కృష్ణుడు, బాదుల్లా, రంజాబీ, సంధ్యారాణి పాల్గొన్నారు.

మారుతీ నగర్‌లో కారు, బైక్ దగ్ధం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న మారుతీ నగర్‌లో మంగళవారం రాత్రి ఓ కారు, బైక్ దగ్ధం అయ్యాయి. మెడికల్ రెప్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్.. మారుతీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన కారు, బైక్ రెండూ పక్కనే ఇంటి ముందు పార్కు చేసి ఉంచాడు. మంగళవారం రాత్రి ఉన్నఫలంగా కారు తగలబడిపోతుండగా స్థానికులు గమనించి కిరణ్‌కు చెప్పారు. కారుతోపాటు పక్కనే ఉన్న బైక్ కూడా తగలబడిపోయింది. బుధవారం విషయాన్ని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమంగా పట్టుబడిన కర్ణాటక మద్యం

కర్నూలు(అర్బన్): స్థానిక పరిమళనగర్‌లో సోదాలు నిర్వహించి వరద శ్రీనివాసులు వద్ద నుంచి 55 (750 ఎంఎల్) ఎన్‌డీపీఎల్ కర్ణాటక మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే చంద్రహాస్ బుధవారం తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోదాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు కే నవీన్‌బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జయరాంనాయుడు, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

36 లీటర్ల నాటు సారా స్వాధీనం ..

కల్లూరు మండలం కొల్లంపల్లి తండాలో సోదాలు నిర్వహించి నేనావత్ లోకేష్ నాయక్ అనే వ్యక్తి వద్ద ఒక మోటారు సైకిల్, 36 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఎమ్మిగనూరు రూరల్: అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యం వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఆదోనికి చెందిన ఎరుకుల ఆకాష్ గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాని ఎల్లమ్మ బీడు బొరుగుల బట్టీ సమీపంలో నిల్వ చేశాడన్నారు. సేకరించిన బియ్యాన్ని రైస్ మిల్లులో సన్న బియ్యంగా మార్చి ఇతర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడన్నారు. గ్రామాల్లో సేకరించిన 21.4 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందడంతో సోదాలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించామన్నారు.